క్లుప్తంగా

నేడు పీఠంలో పౌర్ణమి పూజలు



విజయదుర్గా అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం వైశాఖ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలు, అభిషేకాలతో పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవాని శంకర అష్టమ లింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, నవగ్రహ నక్షత్ర హోమం తదితర పూజలు నిర్వహించనున్నారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, భక్తులతో సామూహిక కుంకుమార్చనలు చేస్తామన్నారు. పీఠంలో పౌర్ణమి పూజలకు హాజరయ్యే భక్తులకు విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలో మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. రెండు సార్లు ప్రమాదకరంగా మలుపులు ఉండడం పక్కనే చెరువు ఉండడం వల్ల ప్రయాణికులు గాయాల పాలవుతున్నారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు మలుపుల వద్ద కూడా స్పీడు తగ్గించకుండా వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారి నిర్మించినప్పటి నుంచి అధికారులకు స్పీడు బ్రేకర్లు వేయాలని వేడుకుంటున్నామని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడు బేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ పెన్షన్ ఇవ్వాలి

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పెన్షన్ మంజూరు చేయాలని అంగర ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు ఆదివారం కోరారు. అంగరలో పెన్షన్ మంజూరు కానివారు అనేక మంది ఉన్నారని, వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించి పెన్షన్ మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి మార్గాలు మృగ్యం కావడంతో అనేక కుటుంబాలు ప్రభుత్వ పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్నాయని వీరన్నబాబు తెలిపారు.

పాప వినాశేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీదుర్గామాతా సమేత పార్వతి పాపవినాశేశ్వరస్వామి, పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దివ్య కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిత్యహోమం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాలధరి కార్తికేయశర్మ ఆధ్వర్యంలో దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. ఈ నెల 8న ప్రారంభమైన కల్యాణ ఉత్సవాలు 13న శ్రీపుష్పయాగంతో ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి రథోత్సవం



ద్రాక్షారామలో సత్యనారాయణస్వామి కల్యాణ రథోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన రమా సత్యవతీ సమేత సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గొప్పలు.. రైతుకు తిప్పలు

- సర్కార్ కొనక వ్యయప్రయాసలు
- పెట్టుబడి సొమ్ములు కూడా రాని వైనం
- మద్దతు ధర కల్పించాలని వేడుకోలు



తేమ శాతం తగ్గడానికి రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

కె.గంగవరం: ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటకు మద్దతు ధర లేకపోవడంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కె.గంగవరం మండలంలో సుమారు 20 వేలు, కాజులూరు మండలంలో 25 వేలు, రామచంద్రపురం మండలంలో 30 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వీటిలో సుమారు 90 శాతం ఈ ఏడాది రైతులు వరి రకం బొండాలు ధాన్యాన్నే పండిస్తున్నారు. మిగిలిన 10 శాతం సన్నాలు పండించారు. పంట చేతికి రావడంతో రైతులు ఆనందంతో కోతలు చేపట్టారు. నాట్లు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 45 నుంచి 55 బస్తాలు వస్తాయని రైతులు అంటున్నారు. తెగుళ్ల, చీడపీడలు, ఎలుకల ఉధృతి తక్కువగా ఉండడంతో కొంత వరకు వరి సాగులో లాభాలు పొందవచ్చని రైతులు అంటున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టాల బాట పట్టారు. ఈ సారైన లాభాలు వస్తాయని అందినకాడల్లా అప్పులు చేసి పంట పండించారు. మండలంలో ముందుగా వేసిన పంట కోతకు రావడంతో కోతలు కూడా ప్రారంభించారు. అయితే ఇలాంటి సమయంలో గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో అవస్థలు

గత వారం రోజులుగా నియోజకవర్గంలో కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లోని ధాన్యం తడిచిపోయింది. దీంతో రోడ్లు, పుంతగట్లు, ఖాళీ స్థలాలు ఇలా ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని ఏ గ్రామంలో చూసిన ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. వరి కోత యంత్రాల ద్వారా కోసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు బస్తా 200 నుంచి 300 వరకు తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. వాతావరణం ఘడియకో రకంగా మారడంతో ధాన్యం వీలైనంత త్వరగా అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా మండలాల్లో ఉన్న దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం బొండాలు 75 కేజీల ధర రూ.1550 రైతులకు చెల్లిస్తున్నారు. తమకు ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని వారు వాపోతున్నారు. ధాన్యాన్ని అమ్మిన రెండు వారాల తరువాత సొమ్ము ఇస్తామనడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వం ప్రకటించిన ధర కన్నా రూ.10 ఎక్కువ చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేసేవారని, ఇప్పుడు దళారులంతా సిండికేట్‌గా మారి రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని ఒకే ధరకి కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. దళారులు చెల్లించే ధర మాకు గిట్టుబాటు ధర కాదని వారు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర ప్రకటించి తక్షణమే ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలని దళారుల దోపిడీ నుంచి తమను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం ప్రకటించిన సీఏ మ్మార్ ధరకే బొండాలను కూడా కొనుగోలు చేయాలని, తడిచిన ధాన్యంతో పాటు మొలకెత్తిన ధాన్యం కూడా మద్దతు ధరకే కొనుగోలు చేయాలి.

– పెట్టా శ్రీనివాస్, బాలాంత్రం

తూకాల వద్ద పర్యవేక్షణ ఉండాలి



దళారులు తూకాలు వేసేటప్పుడు పర్యావేక్షణ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులు ఎక్కువగా నిరక్షరాస్యులు కావడం వల్ల అవకతవకలు జరిగే ప్రమాదం ఉంది.

– సలాది అర్జునరావు, సత్యవాద

ఘనంగా పోలేరమ్మ గ్రామోత్సవం



గరగలను దర్శించుకుంటున్న పీఠాధిపతి గాడ్

రాయవరం: మండలంలోని వెదురుపాకలో ఈ నెల 12న వైశాఖ పౌర్ణమి రోజు రాత్రి పోలేరమ్మ అమ్మవారి జాతర, 13న అమ్మవారి తీర్థం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పోలేరమ్మ, మహాలక్ష్మి, దుర్గమ్మ అమ్మవార్ల ప్రతిరూపాలుగా గరగలను ఆసాదులు శిరస్సున ధరించి గ్రామోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా పీఠంలోని విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో గరగలకు ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అమ్మవారి గరగలను దర్శించారు. గాడ్ కుటుంబ సభ్యులు అమ్మవార్ల ప్రతిరూపాలుగా ఉన్న గరగలకు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ అమ్మవారి జాతర, తీర్థం ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలేరమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టేకుమూడి రాంబాబు తెలిపారు.

ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు



జగన్నాథగిరిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో అశోక్

కాజులూరు: ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని రైతులు మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని జగన్నాథగిరి చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులు నిర్వహిస్తున్న పంట మాసూళ్లను పరిశీలించారు. జగన్నాథగిరిలో ఆయన మాట్లాడుతూ మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు ప్రభుత్వం రూ.1725 చెల్లిస్తుందన్నారు. బయట మార్కెట్‌లో దళారులు రైతులను నమ్మించి తక్కువ ధర చెల్లిస్తున్నారన్నారు. వర్షాలకు తడిసి రంగు మారిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని సైతం కొనుగోలు కేంద్రాలలో గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

అసంఘటిత కార్మికులకు ఈ–శ్రమ్ నమోదు

కపిలేశ్వరపురం (మండపేట): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఈ–శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకొనే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించినట్టు మండపేట సహాయ కార్మికాధికారి కాశి శివనాగమల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ–శ్రమ్ నమోదు ప్రక్రియపై నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నామన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, నామిని ఆధార్ కార్డు, ఆధార్‌కి లింకైన సెల్‌ఫోన్ నంబర్ తదితర వివరాలను దగ్గరలోని మీ సేవ, సీఎస్‌సీ కేంద్రం, వార్డు లేదా గ్రామ సచివాలయంలలో ఎక్కడైనా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ–శ్రమ్‌లో నమోదు కావడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు, ఆర్థిక సహాయం పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. రూ.2 లక్షల ప్రమాద బీమా, ఉపాధి హామీ పథకంలో ఉపాధి పొందేందుకు ఈ–శ్రమ్ కార్డు తప్పనిసరి అన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రావిడెంట్ ఫండ్ చెల్లించనివారు ఈ–శ్రమ్‌కు అర్హులన్నారు. కుటుంబంలో 16 నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సుగల వారు ఎంత మంది ఉన్నా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ–శ్రమ్ కార్డు లేని వారు నూతనంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, కార్డు ఉన్నవారు పోర్టల్‌లో అప్‌గ్రేడ్ చేసుకోవాలని శివనాగ మల్లేశ్వరరావు సూచించారు.

అమ్మే ఆది గురువు



గొల్లపాలెంలో తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

కాజులూరు: సృష్టిలో ప్రతి జీవికి అమ్మే ఆది గురువు అని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. స్థానిక క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులు తమ తల్లులకు కాళ్లు కడిగి పాదపూజ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి జీవి తన జీవనాధారమైన ఆహార సేకరణ తల్లి నుంచే నేర్చుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తల్లి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు టి.భార్గవీరెడ్డి, నల్లమిల్లి విజయలక్ష్మి, నల్లమిల్లి భువన, రుషి, గీతా, పర్ణిక, రాహుల్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు బీటీ రోడ్ల నిర్మాణాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు రూ.5 కోట్ల ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న ద్రాక్షారామ–వెల్ల రోడ్డు, బాపనయ్యచెరువు గ్రామంలో వెంకటాయపాలెం, గణపతినగరం రోడ్డు, రామచంద్రపురం మున్సిపాలిటీలో కొత్తూరు నుంచి మాలపాడు రోడ్డు యనమదలలో రోడ్ల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎంపీపీ అంబటి భవాని, నాయకులు మేడిశెట్టి శేషారావు, డాక్టర్ రాంబాబు, పెంకే సాంబశివరావు, టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి

పి.గన్నవరం: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలోని శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామలారాణి ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను వారు ప్రారంభించారు. మొత్తం 150 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 30 మందిని శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఏడాది పాటు శిక్షణలో రూ.12,500 నుంచి రూ.15 వేల వరకూ స్టైపెండ్, అనంతరం ఉద్యోగం కూడా ఇస్తారని మంత్రి వివరించారు. మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం యువతను కల్తీ మద్యం, గంజాయి వైపు మళ్లించిందని సుభాష్ ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్తిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

అంబాజీపేట: భానుడి భగభగలకు పగలు రోడ్ల మీదకు రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఉక్కబోత, వేడి గాలులు అధికమయ్యాయి. దీంతో భగభగమండే ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఎంతో అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు రాని పరిస్థితి కనిపిస్తోంది. గత నాలుగు రోజులుగా పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో అత్యధికంగా 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదవుతుంది. దీంతో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య సమయంలో రోడ్ల మీదకు ప్రజలు రాలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఒక వేళ వచ్చినా ప్రజలు టోపీలు, నెత్తిమీద టవల్స్, గొడుగులు వంటి ప్రత్యామ్నాయాలు ఉంటే తప్ప రాలేకపోతున్నారు. మరో వైపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో ప్రజల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. ఎండల తీవ్రతకు నిత్యం జన సందోహంతో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, రహదారులు సైతం వెలవెలబోతున్నాయి. భానుడి ప్రతాపానికి భయపడి జనం రోడ్ల మీద రాకపోకలు తగ్గించడంతో వ్యాపారాలకు సైతం దెబ్బ తగిలిందని చిరు వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా ఈ సీజన్‌లో మామిడి పండ్లను పెద్ద ఎత్తున విక్రయిస్తూ ఉంటారు. అయితే ఎండ తీవ్రత ప్రజలు రోడ్ల మీదకు రావడం తగ్గించడంతో మామిడి పళ్ల కొనుగోళ్లు సైతం సన్నగిల్లినట్లు చెబుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి సురక్షితంగా ఉండేందుకు ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు



మున్సిపల్ కమిషనర్ రంగారావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో సోమవారం నుంచి ఈ నెల 15 వరకూ రెండో విడతగా ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు సంవత్సరాలు లోపు చిన్నారులకు బాల ఆధార్ నమోదు, 5 –15 వయస్సుగల బాలబాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. తరవాణిపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల 2వ సచివాలయంలోనూ, గొల్లలగుంటలోని 1వ సచివాలయంలోనూ నిర్దేశించిన డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ సేవలందిస్తారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

కపిలేశ్వరపురం మండలంలో...

మండలంలోని తాతపూడి, టేకి 2, వెదురుమూడి గ్రామ సచివాలయాల్లో ఈ నెల 12, 13 తేదీల్లో ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి ఆదివారం తెలిపారు. 14,15 తేదీల్లో కపిలేశ్వరపురం 2, అంగర 2, నేలటూరు గ్రామ సచివాలయాల్లో నవీకరణ ప్రక్రియను చేస్తారన్నారు. ఆయా కేంద్రాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, అల్లక ఫణీంద్ర సేవలు అందిస్తారని ఎంపీడీఓ రత్నకుమారి వివరించారు.

దివ్యాంగులకు నేడు ఉపకరణాల పంపిణీ



తాడి వీర రాఘవ రెడ్డి, ఎంఈఓ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: నేటి ఉదయం రామచంద్రపురం మండలంలోని 22 మంది, కె.గంగవరం మండలంలోని 20 మందికి మొత్తం 42 మంది దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా అందించనున్నట్లు ఎంఈఓ తాడి వీరరాఘవ రెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరగనున్న ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం మండలాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపకరణాలు మంజూరైన దివ్యాంగ చిన్నారులను తీసుకుని తల్లిదండ్రులు హాజరు కావాల్సిందిగా కోరారు.

భారత సైనికులకు దైవ శక్తి తోడుండాలి

కొత్తపేట: దేశ సరిహద్దుల్లో యుద్ధంలో పాల్గొంటున్న భారత జవాన్లకు దైవ శక్తి కూడా తోడుగా ఉండి.. మన జవాన్లకు ప్రాణనష్టం జరగకుండా.. దొంగ వైఖరి చూపిస్తున్న పాకిస్తాన్‌ను మట్టి కరిపించాలని రెండో కార్యక్రమంగా మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మవారి దేవాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకుడు ఇళ్ల పల్లంచెట్టి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, జిల్లా, మండల బీజేపీ నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, బొర్రా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ చతుర్దశి పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో నృసింహ చతుర్దశి పూజలు ఆదివారం వైభవంగా జరిపారు. మందిర్ నిర్వాహకులు ప్రభూజీ సుందర శ్రీనివాస్ దాస్ ఆధ్వర్యంలో నృసింహ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఐదు గంటలకు హరినామ సంకీర్తనలు, తులసి పూజ, శ్రీలక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఎనిమిది గంటలకు శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

మానసికోల్లాసానికి క్రీడలు తోడ్పాటు

సఖినేటిపల్లి: క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పాటునిస్తాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు అన్నారు. ఆదివారం స్థానిక సువర్ణపేటలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొమ్మిది పేటల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుజ్జిరాజు ప్రారంభించారు. తాడి సహదేవ్, ఆరిపల్లి సత్యనారాయణ, సువర్ణపేట యూత్ పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

మామిడికుదురు: ఆదుర్రులోని తెలగావారి వీధిలో కొలువైన సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం భక్తులు చలివిడి, పానకాలు, నైవేద్యాలు చెల్లించారు. చిత్ర, విచిత్ర వేషధారణలు, మేళ తాళాలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం, తీన్‌మార్ విన్యాసాల నడుమ శనివారం రాత్రి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీపాల కాంతులతో అమ్మవారి ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. జాతర సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

విరులు.. కనులకు సిరులు



రాయవరంలో వికసించిన బార్బొడోస్ లిల్లీ పూలు

స్ట్రిప్డ్ బార్బొడోస్ లిల్లీ పూలు కేవలం మే నెలలో మాత్రమే కనిపిస్తాయి. బ్రెజిల్ దేశంలోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే వీటి శాస్త్రీయ నామం హిప్పేస్ట్రమ్ స్టియాటమ్. కాగా రాయవరంలోని ఓ ఇంట్లో బార్బొడోస్ లిల్లీ పూలు విరబూశాయి. వీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు. అమరల్లీడాసియా కుటుంబానికి చెందినవని బయాలజీ ఉపాధ్యాయులు తెలిపారు.

రాయవరం

చెట్టు..రంగుతో ఆకట్టు



పసుపు వర్ణంలో ఆకట్టుకుంటున్న నిద్రగన్నేరు చెట్టు

పల్లెసీమలు ప్రకృతికి అందాలకు నిలయాలు. చెట్టు, పుట్ట, గట్టు ఇలా ఏవైనా వివిధ ఆకృతులు, ప్రత్యేకతలతో అలరిస్తూ ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతాయి. చూసే వారికి కనువిందు చేస్తాయి. అటువంటి దృశ్యమే ఇది. సాధారణంగా నిద్రగన్నేరు చెట్టు పచ్చటి ఆకులతో ఉంటాయి. కొన్నిమాత్రం పసుపురంగుతో ప్రత్యేకంగా ఉంటాయి. నేలలో పోషక లోపాల వల్ల ఇలా జరుగుతుందని వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. మెగ్నీషియం ఎక్కువైనా, తక్కువైనా ఇటువంటి మార్పు జరుగుతుందని తెలిపారు. మండపేట–కాకినాడ రహదారిలో రాయవరం మండలం మాచవరం వద్ద ఉన్న నిద్రగన్నేరు చెట్టు పసుపురంగు ఆకులతో అలరిస్తుంది. పలువురు ప్రయాణికులు ఈ చెట్టు వద్ద ఆగి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

రాయవరం